# ‘ప్రజాపాలన’ విజయవంతం చేయాలి

- 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన
- క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే బాధ్యత అధికారులదే..
- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ


హాజరైన ఆయా శాఖల అధికారులు


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 25 : ప్రభుత్వ పథకాలు అర్హులకే అందించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజాపాలన కార్యక్రమంపై జిల్లాస్థాయి సమన్వయ సమావేశం మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని అందరి సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. నాయకుల తత్వం, గుణం వేర్వేరుగా ఉంటుందని, కానీ సిస్టం అనేది ఒకేవిధంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం చేసిన వాగ్దానాలు, వాటి ఆచరణ, వాటిని అమలు చేయడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వానికి, పరిపాలనకు అధికారులు గుండె లాంటివారని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి అర్హులకు అందజేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదేనని గుర్తుచేశారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామ సభల్లో దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. జిల్లా యంత్రాంగం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అనంతరం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభు త్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసే దిశగా ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కలెక్టర్ డాక్టర్ శరత్ ప్రజాపాలన నిర్వహణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లను మం త్రికి వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చం ద్రశేఖర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

# కాలయాపనకే గ్రామ సభలు

## నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబర్ 25 : కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీల అమలు కోసం ఈ నెల 28 నుంచి గ్రామ సభలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖేడ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీ పథకాలంటూ కాలయాపన చేసేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆరు గ్యారెంటీలకు అమలు బాధ్యత నాదేనని బాండ్ రాసి సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహించారన్నారు. అయితే వాటి అమలుపై దృష్టి సారించకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 28 నుంచి నిర్వహించే గ్రామ సభల్లో కాంగ్రెస్ నాయకులను ఈ విషయంపై నిలదీయాలన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీలకతీతంగా రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలు సకాలంలో ప్రజలకు అందించామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కార్యకర్తలు, నాయకులకే పథకాలు అందించారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో సీఎం రిలీఫ్‌ఫండ్ నిధులు నాయకులకే పరిమితం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేస్తామని ప్రగాల్భాలు పలికి, ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. గృహలక్ష్మి కింద ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకొని స్థానిక ఎమ్మెల్యేకు నిలదీయాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు మెగా డీఎస్సీ వేస్తామని యువకులకు ఆశపెట్టారన్నారు. హామీలను నెరవేర్చేంతవరకు ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగేశ్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, గంగారం, సత్యపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

# ‘పెండ్లాంతో డిసెంబర్ 31 దావత్’

## -చాంద్‌ఖాన్‌మక్తలో షార్ట్‌ఫిల్మ్ షూటింగ్


యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్ నటీనటులు

వర్గల్, డిసెంబర్ 25 : వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్తలో సోమవారం ‘పెండ్లాంతో డిసెంబర్ 31 దావత్’ అనే షార్ట్‌ఫిల్మ్ సందడి చేసింది. ప్రభుత్వ విరమణ ఉపాధ్యాయుడు రామలింగారెడ్డి పాత పెంకుటింట్లో దర్శకుడు మహేశ్‌యాదవ్ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను తెలంగాణ యూట్యూబ్ చానల్ వర్ధమాన నటీనటులు రాధిక, రాగుల నాగరాజు, పూజతో చిత్రీకరించారు. షార్ట్‌ఫిల్మ్‌ను చూసేందుకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా షార్ట్‌ఫిల్మ్ దర్శకుడు మహేశ్‌యాదవ్ మాట్లాడుతూ గతంలో చిత్రసీమ అంటేనే మాద్రాసు, ఆంధ్ర అనుకునేవారని, కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ కళాకారులు, ఆటవిక సంపదకు తీసుకున్న చర్యలే షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరణకు ఎంతగానో తోడ్పాటునందించినట్లు చెప్పారు.


సన్నివేశం చిత్రీకరిస్తున్న దర్శకుడు మహేశ్‌యాదవ్

# గరికపాటి ప్రవచనాల్లో ఘనాపాఠి

- సిద్దిపేట ప్రజలు ఆధ్యాత్మిక లో ఎప్పుడూ ముందుంటారు...
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


ప్రవచనాలు చెబుతున్న గరికపాటి నరసింహారావు

సిద్దిపేట, డిసెంబర్ 25: ‘గరికపాటి నరసింహారావు ప్రవచనాలు చాలా గొప్పగా ఉన్నాయి. గరికపాటి ప్రవచనాల్లో ఘనాపాఠి.. రామాయణం, మహాభారతం లాంటి పురాణాలు అరటి పండు తొక్క తీసి నోట్లో పెట్టినట్లు ప్రజలకు అర్థమయ్యేలా చెప్పారు’ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న చాణక్య విలువలు గరికపాటి నరసింహారావు ప్రవచనాల్లో పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడారు. ప్రవచనాలు విన్నంత సేపు మనస్సు కుదుట పడిందన్నారు. నేడు టీవీల్లో అరాచకం, అశ్లీలాలు, గొడవలు తప్ప ఏమి లేవన్నారు. సోషల్ మీడియాతో ఇలాంటివి మర్చిపోయారని తెలిపారు. నేటి సమాజానికి వీరి ప్రవచనాలు చైతన్యం తెస్తాయన్నారు. మనస్సుపై పట్టు ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. లేకుంటే అష్టాదశ శక్తిపీఠాలు తిరిగిన దండగే అన్నారు. సినిమా స్టార్స్, క్రికెటర్స్, పొలిటికల్‌కు ఉన్న దానికంటే గరికపాటికి ఫాలోయింగ్ ఎక్కువ ఉందన్నారు. సిద్దిపేట ప్రజలు ఆధ్యాత్మికలో ఎప్పుడూ ముందుంటారని, అయోధ్య రామ మందిర నిర్మాణంలో సిద్దిపేట వాళ్లే భోజనం పెడుతున్నారని, ఇది సిద్దిపేట ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, పాల సాయిరామ్, మారుపల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


ప్రవచనాలు వింటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

# నాడు తండ్రి.. నేడు తల్లి అనారోగ్యంతో మృతి

- అనాథలైన ముగ్గురు పిల్లలు


మృతిచెందిన తల్లి కవిత(ఫైల్)


కావ్యశ్రీ,


శ్రీవాణి


బుషిత్

గజ్వేల్, డిసెంబర్ 25 : నాడు తండ్రి.. నేడు తల్లి అనారోగ్యంతో మృతిచెందగా, ముగ్గురు పిల్లలు అనాథలైన ఘటన మండలంలోని కొల్గూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన నీరుడి భాస్కర్, కవిత దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండేండ్ల క్రితం అనారోగ్యంతో తండ్రి భాస్కర్ మృతిచెందగా, సోమవారం తల్లి కవిత మృతి చెందింది. వారికి ఇద్దరు కూతుళ్లు కావ్యశ్రీ, శ్రీవాణి, కొడుకు ఉన్నారు. భర్త మృతిచెందినప్పటి నుంచి తల్లి ముగ్గురు పిల్లలను సాదుకుంటూ జీవనం సాగిస్తున్నది. కొద్ది రోజుల నుంచి తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా, దవాఖానలో చూపించుకున్న ఫలితం దక్కలేదు. తల్లి కవిత సోమవారం మృతి చెందడంతో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. ప్రస్తుతం కవిత గజ్వేల్‌లోని ఇరిగేషన్ శాఖలో విధులు నిర్వహిస్తున్నది. ప్రభుత్వం పిల్లలను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎంపీటీసీ గొడుగు జ్యోతీస్వామి మృతురాలు కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కవిత పిల్లలకు ప్రభుత్వం అండగా నిలువాలని కోరారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి గొండస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణ పనులు

చేర్యాల, డిసెంబర్ 25 : పట్టణంలో కొనసాగుతున్న జాతీయ రహదారి రోడ్డు నిర్మాణ పనులు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. అఖిలపక్షం ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు అముదాల మల్లారెడ్డి, అందె అశోక్, బూరుగు సురేశ్‌గౌడ్, అందె బీరన్న, బుట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో తీవ్ర అన్యాయం జరుగుతున్నట్లు తెలిపారు. బిల్డింగ్ యజమానులకు నోటీసులు జారీ చేసిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని నిబంధన ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోకుండా పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అధికారులు, మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్లు కుమ్మక్కై రోడ్డు తవ్వకాలు జరపడంతో పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా సమానంగా మార్కింగ్ చేసి ప్రజలు ఇబ్బందులు లేకుండా విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి నారాయణరెడ్డి, పోతుగంటి రామదాసు, భూమయ్య, ముస్త్యాల రాజేశ్, రాళ్లబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, నీల శివకుమార్, శేరి బాలనారాయణ, అయిత సంపత్‌కుమార్, మంచాల కొండయ్య, వ్యాపారులు పాల్గొన్నారు.


చేర్యాలలో రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకులు